

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**Voice of the leader**

జనాభాలో సగానికి పైగా ఉన్న బలహీనవర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది. పార్టీకి వెన్నుదన్నుగా నిలిచే బీసీలను వెన్నుతట్టి ప్రోత్సహించింది. విద్య, ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ ప్రాధాన్యం కల్పించి తోడుగా నిలిచింది. బీసీ జనగణన చేయాలని, చట్ట సభల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపదికగా బడ్జెట్ కేటాయించాలని కేంద్రానికి పంపించింది. అలాంటి పరిస్థితుల నుండి జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బీసీల జీవితాలను ఛిన్నాభిన్నం చేశారు.

- నారా చంద్రబాబునాయుడు

FIRST TELUGU MULTIMEDIA E-PAPER

83 నుండి 90కి జమ్మూకశ్మీర్ శాసనసభ స్థానాలు పెంపు 6
అంబేద్కర్‌కు చంద్రబాబు, లోకేష్ నివాళులు 2
చంద్రబాబుతో పవన్ భేటీ? 3



## నీట మునిగిన పంటలు
# ఆగమైపోయిన రైతన్న

- రూ.7 వేల కోట్లకు పైగా పంట నష్టం జరిగిందని అంచనా
- ఇంతవరకు సాయం ప్రకటించని జగన్ ప్రభుత్వం
- ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పరిశీలన ఎప్పుడు?
- నిబంధనలు సడలించి సాయం పెంచాలంటున్న తెదేపా

పొలాలను ముంచెత్తిన వాననీటిలో తేలుతున్న వరి ఓదెలు.. కోతకు వచ్చిన వరిపైరు నేలవాలి నీటమునగడంతో గల్లంతైన ఆశలు.. కుప్పలు పోసినా లోపలికి చెమ్మచేరి దెబ్బతింటున్న ధాన్యం.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లెదుటే చేజారిపోతుండటంతో కన్నీరుమున్నీరవుతున్న రైతన్నలు.. కోస్తా జిల్లాల్లో ఎటు చూసినా ఇవే దృశ్యాలు. మిచౌంగ్ పెను తుఫాన్ సృష్టించిన విధ్వంసంతో సాధారణ, వాణిజ్య, ఉద్యాన పంటలతో కలిపి రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష తెదేపా కూడా ఇదే అంచనాతో ఉంది. ఇంత భారీనష్టం జరిగినట్లు తెలుస్తున్నా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాత్రం ఇంత వరకు సాయం విషయమై నోరు మెదపక పోవటం విమర్శలకు తావిస్తోంది.

2

## తెలంగాణ సీఎంగా..
# రేవంత్‌కు నేడే పట్టం!

- ఎల్బీ స్టేడియంలో మధ్యాహ్నం 1.04 కి ప్రమాణ స్వీకారం
- హాజరు కానున్న ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక
- చంద్రబాబు సహా పలువురు ప్రముఖులకు ఆహ్వానం
- ప్రమాణ స్వీకారం చేయనున్న 11 మంది మంత్రులు?



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అనుముల రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేవంత్ రెడ్డితోపాటు 11 మంది మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిసింది. మంత్రివర్గ ప్రమాణ స్వీకారం కోసం ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రమాణ స్వీకారం అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయానికి వెళ్లనున్నారు. బుధవారం సాయంత్రం సీఎల్పీ నేతగా తనను ప్రకటించిన అనంతరం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లను కలిశారు. పలువురు నేతలు మిఠాయి తినిపించి.. రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

- మిగతా 3లో..

### తుఫానుపై ముందస్తు చర్యల్లో
## ప్రభుత్వానిది ఘోర వైఫల్యం

లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా తాడేపల్లి ప్యాలెస్ వదలని జగన్‌రెడ్డి: యనమల



2

## జగన్ అలసత్వమే తుఫాన్ భారీ నష్టానికి కారణం

ప్రతిరైతు కన్నీళ్లు తుడవాలి: మర్రెడ్డి

దెబ్బతిన్న పంటలకు పరిహారం బాగా పెంచి ఇవ్వాలి



5

### ఎన్నికల కోసం టీటీడీ నిధుల దారి మళ్లింపు
## రూ.1233 కోట్ల నిధుల దుర్వినియోగం

తనయుని గెలుపు కోసం తిరుపతిలో ఖర్చు చేస్తున్న ఛైర్మన్ భూమన

కళ్లు మూసుకొని చోద్యం చూస్తున్న అడిషనల్ ఈవో ధర్మారెడ్డి

ప్రశ్నించిన టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్



4

## జగన్‌రెడ్డికి ఎన్నికల పాఠాలు
# 5 రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు కోరుకున్నదేమిటి?



- నాలుగు చోట్ల అధికార మార్పిడి
- అహంకారం, అసహనం, అవినీతిని తిరస్కరించిన ప్రజలు
- ముఖ్యమంత్రి రుజువర్తనకు మధ్యప్రదేశ్‌లో ఆదరణ
- సరిదిద్దుకోవటానికి సమయంలేని జగన్‌రెడ్డి
- ఒకే పాఠం.. ఓటమి తప్పదు!

ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల శాసనసభల ఎన్నికల్లో 4 చోట్ల ప్రజలు అధికారంలో ఉన్న పార్టీలను తిరస్కరించారు. ఒక్క మధ్యప్రదేశ్ లోనే శివరాజ్ సింగ్ ప్రభుత్వం అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తెలుసుకోవాల్సిందేమిటి? ఆయా రాష్ట్రాల ప్రజలు ఏమాశించి తీర్పునిచ్చారు?

పక్క రాష్ట్రం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మిజోరాంలలో అధికారంలో ఉన్న పార్టీలు ఓటమి పాలయ్యాయి. రాజకీయ పరిశీలకుల అభిప్రాయాల ప్రకారం.. ఈ నాలుగు రాష్ట్రాల్లోనూ ఏ విధంగా చూసినా మన రాష్ట్రంలోని జగన్‌రెడ్డి పాలన కంటే ఆయా ప్రభుత్వాలు బాగానే పనిచేశాయి.

- మిగతా 6లో..

# జగన్‌రెడ్డికి ఎన్నికల పాఠాలు

## 5 రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు కోరుకున్నదేమిటి?

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమం,అభివృద్ధి పనుల్లో ఆయాప్రభుత్వాల తీరు జగన్‌రెడ్డి ప్రభుత్వం కంటే ఏమాత్రం తీసికట్టుగా లేక పోయినా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది.

**ప్రజలు ఏమాశిస్తారు?**

ప్రతి ఎన్నికలోనూ గతంలో తాము ఆశించిన మేరకు ప్రభుత్వాలు పనిచేశాయా,లేదా? తమ జీవన ప్రమాణాల్లో ఎట్టి మార్పు వచ్చింది? తమ ఆకాంక్షలను ప్రస్తుత ప్రభుత్వాలు నెరవేర్చాయా అన్న అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ఎన్నికల్లో తమ ఓట్ల ద్వారా తీర్పునిస్తారు. కొద్ది దశాబ్దాలుగా ప్రతి ఎన్నికల తరువాత ప్రభుత్వాలు మారటం ఆనవాయిగా వస్తున్నా.. కొన్ని చోట్ల వరుసగా అధికారంలో ఉన్న పార్టీలు తిరిగి గెలవటం కూడా జరుగుతోంది.ఒడిస్సా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ దీనికి కొన్ని ఉదాహరణలు.

ప్రజలు కేవలం తమకు లభించిన వ్యక్తిగత ప్రయోజనాలు, అమలు చేయబడ్డ పథకాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఓట్లేస్తారా? ఈ రెండు అంశాలు ప్రధానమైనప్పటికీ కేవలం అవి మాత్రమే నిర్ణయాత్మక అంశాలు కాదనేది రాజకీయ శాస్త్రవేత్తలు, పరిశీలకుల అభిప్రాయం. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ముఖ్యమంత్రులు, శాసనసభ్యుల ప్రవర్తనలు కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయని వారి అభిప్రాయం. ఎన్నికల్లో అవినీతి అంశం అంత ప్రాధాన్యత సంతరించుకోకపోయినా..ఓట్లు వేసే సమయంలో ఒక నిర్ణయం తీసుకునేటప్పుడు ఇతర కారణాలతో పాటు అంతర్లీనంగా అధికార పార్టీ అవినీతి ప్రముఖ పాత్ర పోషిస్తుందని పరిశీలకుల అభిప్రాయం.

దీంతోపాటు.. ముఖ్యమంత్రి ప్రజలకు ఏ విధంగా అర్థమయ్యారు అన్న విషయం కూడా ప్రధానమే. ముఖ్యమంత్రి,శాసనసభ్యులు మాట్లాడే తీరు,వాడే భాష, పాలనా ధోరణి ఓటర్ల మనసులను ప్రభావితం చేస్తాయి. అహంకార ధోరణి, ఏక వ్యక్తి పాలన, అసహనం, రాష్ట్ర ప్రజలకు తానే దిక్కు అన్న ధోరణి, ప్రతిపక్షాల పట్ల వ్యవహరించే తీరు, రాజ్యాంగం మరియు చట్టాల పట్లచూపే గౌరవం ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయని రాజకీయ నిపుణుల అభిప్రాయం.

తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను వీలైనంత మేరకు బాగానే చేసినా ప్రజల తిరస్కారానికి గురికాక తప్పలేదు. ఆయన వ్యక్తిగత వ్యవహార తీరు, కుటుంబ సభ్యులు, బంధువుల చేతుల్లో కేంద్రీకృతమైన అధికారం, అధికార పరిధిని విస్తృతం చేసుకోవాలనే కాంక్ష, రాజకీయ పిల్లిగంతులు,ప్రతిపక్షాలతో వ్యవహరించిన తీరు, కొన్ని సంక్షేమ పథకాల రూపకల్పన, అమలులో లోపాలు, ఫామ్ హౌస్ నుంచి ఎక్కువగా సాగిన పాలన భారాస ఓటమికి ప్రధాన కారణాలని ఎన్నికల ఫలితాల అనంతర విశ్లేషణలో వెల్లడైనాయి. ఆయన వ్యవహరించిన విధానం చాలావరకు అహంకార పూరితంగా ఉందని ప్రజలు భావించటం జరిగింది.ప్రభుత్వం ఏర్పాటు ప్రజలు ఇచ్చిన అవకాశంగా కాక అది తమ,తమ కుటుంబ హక్కుగా భావించి సొంత ప్రయోజనాల కోసం అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు ప్రజలు అర్థం చేసుకున్నారు.

ఛత్తీస్ గఢ్‌లో కాంగ్రెస్ తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని దాదాపుఅన్ని ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు సూచించినా ఓటర్ల తీర్పు అందుకు వ్యతిరేకంగా వచ్చింది. మహదేవ్ యాప్ అంశంలో అవినీతి, అంతర్గత కుమ్ములాటలు, సహచర మంత్రులను కలుపుకొని పోకుండా వ్యవహరించిన ముఖ్యమంత్రి భఘేల్ తీరు కాంగ్రెస్ పార్టీని దెబ్బతీశాయి.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సహచరపార్టీ నేత సచిన్ పైలెట్‌తో నిరంతరం కొనసాగించిన అధికార పోరాటం,ఆ మేరకు జరిపిన రాజకీయాలు, పరీక్షా పేపర్ల లీకులు, అవినీతి ఆరోపణలు కాంగ్రెస్ పరాజయానికి బాటలు వేశాయి.

దీర్ఘకాలంగా మిజోరాంలో అధికారంలోఉన్న మిజో నేషనల్ ఫ్రంట్ నేత, ముఖ్యమంత్రి జోరం థాంగ్ తీరు, ఆయన పార్టీ శాసనసభ్యుల వ్యవహారం, పరిపాలనా వైఫల్యాలు ఓటమికి దారితీశాయి.

**చౌహాన్ ప్రత్యేకత**

శివరాజ్ సింగ్ చౌహాన్ 5 సార్లు ముఖ్యమంత్రిగా ఉండి ఇటీవల ముగిసిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని మరలా విజయపథంపై నడిపించారు.దీర్ఘకాలంగా ముఖ్యమంత్రిగా ఉన్నందున ప్రజా వ్యతిరేకత నెలకొనివుంటుందన్న అనుమానంతో ఇటీవల ఎన్నికలకు ముందు కొత్త అభ్యర్థి ముఖ్యమంత్రి కావచ్చని భాజపా అధిష్టానం సంకేతాలిచ్చింది. కేంద్ర నాయకత్వం అనుమానాలను పటాపంచలు చేసి బీజేపీని చౌహాన్ తిరిగి గెలిపించారు. వివాద రాహిత్యంగా రాజకీయాలు, పాలన చేయటం, సౌమ్యుడిగా పేరుగాంచటం, ప్రజలతో నిత్యం మమేకమవటం,పౌరుల హక్కులకు భంగం కలిగిన సంఘటనల్లో ఆయన వ్యవహరించిన తీరు,కుటుంబ సభ్యుల్ని, బంధువులను అధికారానికి దూరంగా ఉంచటం, ప్రతిపక్షాలను దూషణలాడకపోవటం చౌహాన్‌కి దీర్ఘకాలం అండగా నిలిచాయి. ప్రజలకు ఆయన 'మామ'గా పేరుగాంచారు. ఒక దళితుడిపై అగ్ర కుల వ్యక్తి మూత్రవిసర్జన చేస్తే.. చౌహాన్ ఆ బాధితుడి ఇంటికి పోయి ఆయన కాళ్లు శుభ్రంచేసి, సహభోజనం చేశారు. అంతటి విశిష్ట వ్యక్తి కనుకనే 4సార్లు భాజపాను విజయమార్గంలో నడిపించగలిగారు.

**జగన్ రెడ్డి తీరు**

గత 54 నెలలుగా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తీరు.. అహంకారం, అవినీతి, అరాచకాలు, ఆశ్రిత పక్షపాతం, అసహనం, అప్రజాస్వామిక ధోరణి, అసమర్థ పాలనకు ప్రతీకగా నిలిచింది.

అడుగడుగునా విధ్వంసం, విద్వేషాలకు ఆలవాలమైంది.

ప్రతిపక్షాలపై దమనకాండ, అక్రమ కేసుల బనాయింపు, చట్టాన్ని చుట్టంగా మార్చుకోవటం నిత్యకృత్యమైంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రిగా కాక నియంతగా ముఖ్యమంత్రి వ్యవహరించారు. ఎంతో ఆశించి గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చిన ప్రజలను నయవంచనకు గురిచేశారు. రాష్ట్రానికి మరో నలుగురు అస్మదీయులను సామంతులుగా నియమించి నిత్యం కబ్జాలు, దోపిడీలకు దోహదం చేశారు. మంత్రులకు, సొంత పార్టీ ఎమ్మెల్యేలకు కూడా కలిసేందుకు సమయం ఇవ్వకుండా సర్వం తానై వ్యవహరించారు. అన్ని వ్యవస్థలను తన అరాచకాలు, స్వప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టే దుర్నీతితో ప్రజల ప్రాథమిక హక్కులను కబళించి వారి వ్యక్తిగత గౌరవాన్ని అవహేళన చేసి ప్రజాగ్రహాన్ని మూటగట్టుకున్నారు.

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తీరు పట్ల ప్రజల్లో పెల్లుబుకుతున్న వ్యతిరేకతకు ఇటీవల కొన్ని స్పష్టమైన సంకేతాలు వెల్లడయ్యాయి. గడప గడపకు కార్యక్రమంలో వెల్లడైన ప్రజాగ్రహం, సామాజిక న్యాయ బస్సు యాత్రకు ఎదురైన నిరాదరణ, నాలుగు ఎమ్మెల్సీ సీట్లకు జరిగిన ఎన్నికల్లో ఓటమి జగన్ రెడ్డి పట్ల వ్యతిరేకతకు సాక్ష్యంగా నిలిచాయి.

ఇటీవల ముగిసిన 5 రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాల నుంచి ముఖ్యమంత్రి నేర్చుకోవాల్సిన గుణపాఠాలు చాలా ఉన్నాయి. అహంకారపూరితుడైన జగన్ రెడ్డి ఒకవేళ మనసు మారి తన లోపాలను సరిదిద్దుకోవాలనుకున్నా ఎన్నికలు సమీపించినందున అందుకు సమయం లేదు. ఆయన తెలుసుకోవాల్సిన ఏకైక నిజం.. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఏమాత్రం తప్పదు.

## ఎకరాకు రూ.40,000 పరిహారం అందించాలి

**ప్రత్తిపాడు నియోజకవర్గంలో పంట పొలాలను పరిశీలించిన టీడీపీ ఇన్ ఛార్జ్**

**అధైర్య పడొద్దు... అండగా ఉంటామని రైతులకు బూర్ల రామాంజనేయులు భరోసా**



ప్రత్తిపాడు (చైతన్యరథం): మిగ్ జాం తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ బూర్ల రామాంజనేయులు పరిశీలించారు. తుపాను ప్రభావం వల్ల నీట మునిగిన పంట పొలాలను సందర్శించిన ఆయన రైతులతో కలిసి కాకుమాను, ప్రత్తిపాడు పెదనందిపాడు మండలాల్లోని మొత్తం 9గ్రామాలలో సుడిగాలి పర్యటన చేపట్టారు. నీట మునిగిన వరి, పొగాకు,మొక్కజొన్న, మిర్చి,శనగ, ప్రత్తి,మినుము పంటలను పరిశీలించి రైతులను అడిగి వివరాలు సేకరించారు. మోకాలు లోతులో నీరు ఉన్న పొలంలోకి వెళ్లి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం నుండి మీకు రావాల్సిన నష్టపరిహాన్ని వచ్చే విధంగా తెలుగుదేశం పార్టీ తరఫున పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పంట నష్టపోయిన రైతులందరికీ తక్షణమే నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే వరి, పొగాకు, పత్తి , శనగ, మినుము పంటలకు నష్టపరిహారం కింద ఎకరానికి రూ.40,000 చొప్పున వెంటనే చెల్లించాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు.

## 83 నుండి 90కి జమ్మూకశ్మీర్ శాసనసభా స్థానాలు పెంపు

**బిల్లుకు ఆమోదం తెలిపిన లోక్‌సభ • పీవోకే కూడా మనదే అన్న అమిత్ షా**

ఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీని ఏర్పాటు చేసేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే 'జమ్మూకశ్మీర్ రిజర్వేషన్(సవరణ) బిల్లు-2023', 'జమ్మూకశ్మీర్ రీఆర్గనైజేషన్(సవరణ) బిల్లు-2023'ను లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ఈబిల్లుల్లో పునర్విభజన తర్వాత శాసనసభ నియోజక వర్గాలసంఖ్య ఎలా ఉండనుంది? రిజర్వేషన్ల అమలుఎలా? వంటి అంశాలను పొందుపర్చారు. వీటిపై లోక్ సభలో రెండు రోజులపాటు చర్చ చేపట్టారు. ఈసందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ బిల్లుల్లోని కీలకఅంశాలను సభకు వెల్లడించారు.గతంలో జమ్మూకశ్మీర్‌లో శాసనసభ నియోజకవర్గాల సంఖ్య 83ఉండగా...తాజాబిల్లులో దాన్ని90కి పెంచాలని ప్రతిపాదించారు.ఇంతకు ముందు కశ్మీర్ డివిజన్‌లో 46, జమ్ము డివిజన్‌లో 37స్థానాలు ఉండేవి. తాజా బిల్లులో కశ్మీర్ డివిజన్‌లో అసెంబ్లీ స్థానాలను 47, జమ్ముడివిజన్‌లో 43కు పెంచినట్లు అమిత్ షా వెల్లడించారు.ఇక పాక్ ఆక్రమిత కశ్మీర్ మనదేశంలో భాగమేనని ఆయన అన్నారు. అందుకే,అక్కడకూడా 24స్థానాలను రిజర్వ్ చేసినట్లు ప్రకటించారు. ఇక కశ్మీర్‌లో రెండు స్థానాలను కశ్మీర్ నుంచి వలసవెళ్లిన వాళ్లు, ఒక స్థానాన్ని పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వచ్చి స్థిరపడినవారికి రిజర్వ్ చేసినట్లు అమిత్‌షా తెలిపారు. తొలిసారిగా ఎస్సీ /ఎస్టీ కమ్యూనిటీలకు 9స్థానాలు కేటాయించినట్లు పేర్కొన్నారు.



"70 ఏళ్లుగా అన్యాయానికి, అవమానాలకు గురైన వారికి న్యాయం చేసేందుకు ఈబిల్లులను ప్రవేశపెడుతున్నాను.ఏ సమాజంలోనైనా వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావాలి. ఈక్రమంలో వారి గౌరవానికి ఏమాత్రం భంగం కలగకుండా చూడాలి. అదే భారత రాజ్యాంగం ప్రాథమిక ఉద్దేశం. ప్రస్తుతం చాలా మంది కశ్మీరీలు శరణార్థి శిబిరాల్లో తలదాచుకొంటున్నారు. ఈ బిల్లుతో వారికి హక్కులు, ఉద్యోగాలు, విద్యావకాశాలు,రిజర్వేషన్ల సాయంతో ఎన్నికల్లో నిలబడే అవకాశాలు వస్తాయి" అని అమిత్‌షా వెల్లడించారు. ఇక ప్రతిపక్షాలు కశ్మీర్‌లో ఆర్టికల్ 370 తొలగింపు తర్వాత కూడా ఉగ్రవాదం కొనసాగడంపై అడిగిన ప్రశ్నకు అమిత్‌షా స్పందించారు. "మోదీ ప్రభుత్వం వచ్చాక పౌర మరణాల్లో 10 శాతం, భద్రతా సిబ్బంది మరణాల్లో 88శాతం తగ్గుముఖం పట్టాయి. ఆర్టికల్ 370 తొలగింపుతో ఉగ్రవాదం అంతమైపోతుందని ఎవరూ చెప్పలేదు. వేర్పాటువాద అంతమవుతుందని నేను చెప్పాను. 2026 నాటికి ఉగ్రవాద ఘటనలు సున్నాకు తీసుకురావడం కోసం ప్రణాళికలు రచిస్తున్నాం" అని వెల్లడించారు. చర్చ సందర్భంగా కశ్మీర్ ఇన్ని బాధలు పడడానికి అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన రెండు తప్పిదాలు కారణమని, ఒకటి కాల్పుల విరమణ కాగా , రెండోది కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితికి తీసుకెళ్లడమని అమిత్ షా పేర్కొన్నారు. అలాగే నెహ్రూ సరైన చర్యలు తీసుకొని ఉంటే పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య వచ్చి ఉండేదే కాదని, ఇది చారిత్రాత్మిక తప్పిదని అమిత్‌షా అన్నారు. అయితే నెహ్రూపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ నుండి వాకౌట్ చేశారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి: పురందేశ్వరి

అమరావతి: తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న ఉద్యానవన పంటల సాగుదారులకు వెంటనే ఆర్థిక సహకారం మంజూరు చేయాలని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో సాగు చేసిన రైతాంగాన్ని కూడా ఆదుకోవాలని కోరారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆహారధాన్యాలతో పాటు ఉద్యానవన పంటలతో సహా పలు వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అయితే బీమా చేసిన రైతాంగం ఎంతమంది.. లేనివారు ఎంతమంది అనే గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ డొమైన్‌లో పెట్టక పోవడం వల్ల రైతాంగం ఆందోళన చెందే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయన్నారు. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం వెంటనే ఒక ప్రకటన చేయాలని దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు.

# అన్నదాతలను నట్టేట ముంచిన మిచౌంగ్


చింతలపూడిలో


గన్నవరం మండలం దావజీగూడెంలో


పామర్రులో


గోపాలపురం నియోజకవర్గంలో


పెడన నియోజవర్గం కల్పటంలో


కొత్తావులపల్లి, సీతానగరంలో


కురుపాం నియోజకవర్గం ఉదయపురంలో


జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలులో


కృష్ణాజిల్లా గుడివాడ.. తట్టివర్రు, రామన్నపూడి గ్రామాల్లో


నాగాయలంక మండల పరిధిలోని నంగేగడ్డ, చోడవరంలో


అనపర్తి నియోజకవర్గం.. సంపర - కాండ్రేగులలో


నిమ్మనపల్లి మండలంలో


ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి, ఉత్తరకంచిలో


నరసరావుపేట నియోజకవర్గం.. రొంపిచర్ల మండలంలో


ఒంగోలు జిల్లా బొద్దులూరివారి పాలెం, వలేటివారిపాలెంలో

# రాహుల్‌కు రాజకీయ చతురత అబ్బలేదు

## డైరీలో రాసుకున్న ప్రణబ్ ముఖర్జీ

**ఢిల్లీ** : గాంధీ-నెహ్రూ కుటుంబాల వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రాహుల్ గాంధీకి రాజకీయ చతురత మాత్రం వారసత్వంగా అబ్బలేదని మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ అభిప్రాయపడ్డారట. ఇదే విషయాన్ని ఆయన కొన్నేళ్ల కిందట తన డైరీలో రాసుకున్నారట. తన తండ్రి జీవితంపై రాసిన పుస్తకంలో ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "ఇన్ ప్రణబ్, మై ఫాదర్: ఏ డాటర్ రిమెంబర్స్' పేరుతో శర్మిష్ఠ ఈ పుస్తకాన్ని రచించారు. బతికున్న రోజుల్లో తన తండ్రి చెప్పిన విషయాలు, ప్రణబ్ డైరీతో పాటు ఆయన రాజకీయ జీవితంపై అధ్యయనం చేసి ఆమె ఈ పుస్తకాన్ని రాశారు. అందులో నెహ్రూ-గాంధీ కుటుంబం పట్ల ఆయనకున్న వ్యక్తిగత ఆరాధన, రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తు... ఇలా పలు ఆసక్తికర అంశాలను వివరించారు. రాహుల్ గురించి ప్రణబ్ తన డైరీలో రాసుకున్న అభిప్రాయాలను కూడా శర్మిష్ఠ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. "రాహుల్ చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. అనేక ప్రశ్నలు సంధిస్తారు. కానీ, రాజకీయాల్లో ఆయన పరిణతి సాధించలేదు. 2013 జులైలో రాహుల్ ఓ సారి మా ఇంటికి వచ్చారు. పార్టీ పునరుద్ధరణకు సంబంధించి తన ప్రణాళికలను చెప్పారు. ఆయన సవాళ్లను ఎదుర్కోగలరని అనిపించింది. అయితే, ముందు కేబినెట్‌లో చేరి పాలనాపరమైన అంశాల్లో అనుభవం గడించాలని చెప్పా. కానీ నా సలహాను ఆయన వినిపించుకోలేదు" అని ప్రణబ్ నాటి సంగతులను తన డైరీలో రాసుకున్నారు.

ఇక 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ ప్రతులను రాహుల్ మీడియా ముందు చించేసిన ఘటనను కూడా శర్మిష్ఠ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఆ విషయం తెలియగానే ప్రణబ్ ముఖర్జీ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారట. "రాహుల్ అసలు ఏమనుకుంటున్నారు? ఆయన కేబినెట్ సభ్యుడు కాదు. కేబినెట్ నిర్ణయాన్ని బహిరంగంగా చించేయడానికి ఆయనెవరు? ప్రధాని విదేశాల్లో ఉన్నారు. తన చర్యలు ప్రధానిపై, ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆయనకు తెలుసా?" అని ఆరోజు ప్రణబ్ ఆగ్రహించినట్లు శర్మిష్ఠ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత ప్రణబ్ తన డైరీలో... "గాంధీ-నెహ్రూ కుటుంబాల అహంకారమంతా రాహుల్‌కు వచ్చింది. కానీ వారి రాజకీయ చతురతే ఆయనకు అబ్బలేదు" అని రాసుకున్నారట. రాహుల్ అలా ఆర్డినెన్స్ పత్రాలను చించేయడంతోనే యూపీఏ కూటమి మరింత పతనమైందని ప్రణబ్ అభిప్రాయపడ్డారు. "2014 ఎన్నికల్లో యూపీఏ ఓటమికి ఇది కూడా ఓ కారణమే. ప్రధానినే గౌరవించని వారికి ఎవరైనా ఎందుకు ఓటేస్తారు" అని అప్పట్లో ఆయన పార్టీకి తెలిపినట్లు శర్మిష్ఠ తన పుస్తకంలో పేర్కొన్నారు. జైలు శిక్షపై కింది కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ పైకోర్టులో అప్పీల్ చేయడానికి వీలుగా 'ఆటోమేటిక్ సస్పెన్షన్' నిబంధన 3 నెలల వరకు అమల్లోకి రాకూడదని ప్రజాప్రాతినిధ్య చట్టంలో ఉండేది. ఈ నిబంధనను 2013 జులై 10న సుప్రీంకోర్టు కొట్టేసింది. అయితే ప్రజాప్రతినిధుల కేసులు ఎగువ కోర్టులో పెండింగ్‌లో ఉండగా వారిపై అనర్హత వేటు వేయడానికి వీల్లేదంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013 ఆగస్టులో ప్రజాప్రాతినిధ్య చట్టం (రెండో సవరణ) బిల్లును తెచ్చింది. అది సభామోదం పొందకపోవడంతో దాణా కేసులో యూపీఏ భాగస్వామి లాలూ ప్రసాద్‌ను రక్షించడానికి కేంద్రం 2013 సెప్టెంబరు 24న ఆర్డినెన్స్ జారీచేసింది. జైలుశిక్ష పడ్డ నేతలపై తక్షణం అనర్హత వేటు పడకుండా చూసేందుకు ఈ చర్య చేపట్టింది. దీనిపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో 2013 సెప్టెంబర్ 27న రాహుల్ విలేకర్ల సమావేశంలో ఆ ఆర్డినెన్స్ ప్రతులను చించేశారు.



## 100కు పైగా పార్ట్‌టైమ్ జాబ్ సైట్లను నిషేధించిన కేంద్రం




**ఢిల్లీ:** వ్యవస్థీకృత అక్రమ పెట్టుబడులు, టాస్క్-ఆధారిత పార్ట్‌టైం జాబ్ మోసాలను అరికట్టేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ తరహా మోసాలకు కారణమవుతున్న వెబ్‌సైట్లపై కొరఢా ఝుళిపింపించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సిఫార్సుల మేరకు దాదాపు 100కు పైగా వెబ్‌సైట్లను కేంద్ర ఐటీ శాఖ బ్లాక్ చేసింది. ఈ మేరకు బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. వ్యవస్థీకృతంగా మోసపూరిత పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ నేరాలపై కేంద్ర హోం శాఖకు చెందిన ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ విభాగం ఇటీవల పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ తరహా మోసాలు జరుగుతున్న కొన్ని వెబ్‌సైట్లను గుర్తించి... వాటిని తక్షణమే బ్లాక్ చేయాలని ఐటీ శాఖకు సిఫార్సు చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ఐటీ శాఖ తమ ప్రత్యేక అధికారాలతో 1008 పైగా వెబ్‌సైట్లపై నిషేధం విధించింది. ఆర్థిక నేరాలను ప్రోత్సహిస్తున్న ఈ వెబ్‌సైట్లను విదేశీ వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు ఐటీశాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. డిజిటల్ ప్రకటనలు, చాట్ మెసెంజర్స్, రెంటెడ్ అకౌంట్లను వినియోగించి వీరు తమ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు తెలిపింది. ఇలా ఆర్థిక మోసాల నుంచి వచ్చిన సొమ్మును క్రిప్టో కరెన్సీలు, విదేశీ ఏటీఎం కార్డులు, ఇంటర్నేషనల్ ఫిన్‌టెక్ కంపెనీల సాయంతో మనీలాండరింగ్ చేస్తున్నారని తాము గుర్తించినట్లు ఐటీశాఖ పేర్కొంది. అయితే, ఈ వెబ్‌సైట్ల వివరాలను కేంద్రం వెల్లడించలేదు.

ఈ సందర్భంగా పార్ట్‌టైం జాబ్ మోసాలపై కేంద్రం హెచ్చరికలు చేసింది. 'ఇంట్లోనే కూర్చుని సంపాదన' వంటి ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు యూజర్లను ఆకట్టుకుంటారని పేర్కొంది. రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులను ఎక్కువగా టార్గెట్ చేస్తారని తెలిపింది. "అలాంటి యాడ్స్ క్లిక్ చేయగానే... వారి ఏజెంట్లు వాట్సప్, టెలిగ్రామ్ వంటి మాధ్యమాల్లో యూజర్లతో మాట్లాడుతారు. వీడియోలు లైక్ చేయడం, సబ్‌స్క్రైబ్ చేయడం, రేటింగ్ ఇవ్వడం వంటి టాస్క్‌లు చేసి ఇంట్లోనే కూర్చుని డబ్బు సంపాదించొచ్చు అంటూ యూజర్లను వలలో వేసుకుంటారు. తొలుత కొంత కమిషన్ ఇచ్చి... ఆ తర్వాత లాభాల ఆశజూపి పెట్టుబడి మోసాలకు పాల్పడుతారు" అని కేంద్రం తెలిపింది. ఇలాంటి మోసాల పట్ల యూజర్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు చేయొద్దని సూచించింది. ఇటీవల మహాదేవ్ బెట్టింగ్ యాప్ వివాదం నేపథ్యంలో అక్రమంగా బెట్టింగ్‌కు పాల్పడే 12 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం నిషేధం విధించిన విషయం తెలిసిందే. వాటిలో మహాదేవ్, రెడ్డీఅన్న ప్రెస్టోప్రో వంటి యాప్‌లు ఉన్నాయి.

## డీఎంకే ఎంపీ వివాదస్పద వ్యాఖ్యలపై బిజెపి ఆగ్రహం...

### - క్షమాపణలు చెప్పిన సెంథిల్



**ఢిల్లీ:** ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలను వేరుగా చూస్తూ డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై భాజపా తీవ్ర స్థాయిలో మండిపడింది. ఈ వ్యవహారంపై డీఎంకే మిత్రపక్షమైన కాంగ్రెస్, ఆ పార్టీ సీనియర్ నేతలు (సోనియా, రాహుల్ గాంధీలు) ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించింది. ఎన్నికల్లో ఓటమికి గల కారణా లను విశ్లేషించడానికి బదులు భారతీయ సంస్కృతిని, గుర్తింపును అవమానించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించింది. కాంగ్రెస్ అనుమతితోనే మిత్రపక్షం ఈ వ్యాఖ్యలు చేసిందా? అని భాజపా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. డీఎంకే ఎంపీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ 'వసుధైక కుటుంబం' అనే సందేశాన్ని ఇస్తుంటే. ప్రతిపక్షం మాత్రం అసభ్యకరమైన భాషను ఉపయోగించడం, ఈవీఎంలను నిందించడం, మూడు రాష్ట్రాల్లో ఓటమికి ప్రాంతీయతను కారణంగా చూపే పనిలో పడింది. రాజ్యాంగబద్ధమైన సంస్థలను కాంగ్రెస్ విశ్వసించదు. ఓటమి తర్వాత వాటికి గల కారణాలను వాళ్లు విశ్లేషించుకోరు. ఈవీఎంలపై ఆరోపణలు, హిందూ ధర్మం, దేశ సంస్కృతిపై ఆరోపణలు చేస్తూనే ఉన్నారు' అని కాంగ్రెస్ తీరుపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలోనూ కుల, మత అంశాలను కాంగ్రెస్ నేతలు ప్రస్తావించారని.. అవి అక్కడ పనిచేయకపోవడంతో విభజన వాదానికి తెరతీశారని అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. దేశ సంస్కృతిని అవమానించే డీఎంకేతో కాంగ్రెస్ పార్టీకి ఇంకా దోస్తీ ఎందుకని ప్రశ్నించారు. దేశాన్ని ఉత్తర-దక్షిణాలుగా విభజించి చూసే ట్రెండ్ అమేథీలో 2019లో రాహుల్ గాంధీ ఓటమి చెందినప్పటి నుంచే మొదలయ్యిందని దుయ్యబట్టారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా విజయం సాధించగా... తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ గెలుపొందింది. ఈ నేపథ్యంలో హిందీ రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలుగా అభివర్ణిస్తూ అక్కడ మాత్రమే కాషాయ దళం గెలువగలదని డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై పలు రాజకీయ పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యింది. ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలపై సెంథిల్ కుమార్ స్పందించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ ఓ అనుచిత పదాన్ని తాను ఉపయోగించానని, ఏ దురుద్దేశంతోనూ దాన్ని వాడలేదన్నారు. పార్లమెంటులోనూ క్షమాపణలు చెప్పారు.

## మహాదేవ్ యాప్ స్కామ్ నిందితుడి తండ్రి అనుమానస్పద మృతి

**ఢిల్లీ:** ఛత్తీస్‌గఢ్‌లో రాజకీయంగా పెను సంచలనం సృష్టించిన మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణంలో కీలక నిందితుడి తండ్రి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. రాష్ట్రంలోని దుర్గ్ జిల్లాలోని అచ్చోటి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకొంది. మహాదేవ్ యాప్ కుంభకోణంలో అసిమ్ దాస్ కీలక నిందితుడు. అతడి తండ్రి సుశీల్‌దాస్ (82) ఆచూకీ గత రెండు రోజులుగా తెలియడం లేదు. అతడి మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామం లోని ఓ బావిలో గుర్తించారు. జిల్లా సీనియర్ ఎస్పీ రామ్‌గోపాల్ గర్గ్ ఈ ఘటనపై మాట్లాడుతూ... సుశీల్ దాస్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మృతుడు ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు సుశీల్‌దాస్ కుమారుడు అసిమ్ దాస్(కొరియర్), కానిస్టేబుల్ భీమ్ సింగ్‌ను మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణంలో నవంబర్ 8వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. ఈ బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్‌కు రూ.508 కోట్ల మేర ఇచ్చినట్లు ఈడీ ఆరోపించింది. ఈ కేసులో అరెస్టయిన కొరియర్ తొలుత తన వాంగ్మూలంలో ఈ విషయాన్ని చెప్పినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది.




అయితే, తర్వాత కొరియర్ మాట మార్చాడు. ఎన్నికలకు ముందు ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం లేపింది. ఈ యాప్ ప్రమోటర్లలో ఒకరైన సౌరభ్ చంద్రకర్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఏఈలో జరిగింది. ఇందుకోసం రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. బాలీవుడ్ సెలబ్రిటీలను దీనికి ఆహ్వానించినట్లు ఈడీ గుర్తించింది.

## అందరూ మా పథకాలను కాపీ కొడుతున్నారు

### : అరవింద్ కేజ్రీవాల్



**ఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలనే ఇతర పార్టీలు కాపీ కొడుతున్నాయని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. వీటిలో ఉచిత విద్యుత్ హామీని మాత్రమే అమలు చేస్తున్నారని, ఉచిత విద్య గురించి ఏ ఒక్క పార్టీ కూడా హామీ ఇవ్వడంలేదని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశించి విమర్శలు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని పార్టీ ఆఫీసులో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. " డాక్టర్ బీఆర్. అంబేద్కర్ మరో 15 ఏళ్లపాటు జీవించి ఉంటే దేశంలో ప్రభుత్వ పాఠశాలలను ఎంతో మెరుగుపరిచేవారు. ప్రస్తుతం ఏ పార్టీ కూడా అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య ప్రాధాన్యతను గుర్తించడంలేదు. కొన్ని పార్టీలు ఆప్ హామీలను కాపీ కొట్టి... పథకాలను అమలు చేస్తున్నాయి. కానీ, ఉచిత విద్య గురించి మాత్రం మాట్లాడటంలేదు. ఉచిత విద్య హామీ ఆప్ మాత్రమే ఇవ్వగలదు. విద్యారంగ అభివృద్ధికి ఆప్ ఎంతో కృషి చేసింది" అని కేజ్రీవాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఆప్ నుంచి అధికారాన్ని లాక్కునేందుకు ఎన్నో అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కానీ, ప్రజలకు సేవ చేసేందుకే ఆప్ ఉందని, దేశాభివృద్ధి కోసం చేసే పోరాటంలో తమ విధానాలను వదులుకోలేమని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.


తుఫాను బాధితులకు
ఇదేనా సాయం..?
పునరావాస కేంద్రాల్లో కుక్కేసిన జగన్ సర్కార్
బాధితులను పట్టించుకునే దిక్కు కూడా లేదు
తాగడానికి నీళ్లు లేవు..
కనీసం అన్నం కూడా పెట్టలేరా..?
అభాగ్యులను ఆదుకోవడం ఇలాగేనా..?
జగన్ సర్కార్ తీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
ముంపు బాధితులను
ఫోన్‌లో పరామర్శించిన టీడీపీ అధినేత